క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ పర్యటన రద్దు

హుజూర్‌నగర్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ పర్యటన రద్దయింది. ఈమేరకు మంత్రి పీఆర్‌ఓ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మంగళవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో రూ.12 కోట్లతో చేపట్టనున్న కొత్త భవనాల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయాలి. కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులకు అసౌకర్యం కలుగుతుందనే ఉద్దేశంతో నెలాఖరుకు వాయిదా వేసినట్లు తెలిపారు. మిగతా చోట్ల మంత్రి పాల్గొనే కార్యక్రమాలు యధావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో కోదాడ విద్యార్థికి సీటు


ఉస్తెల ధనుష్‌రెడ్డి

కోదాడ : బెంగళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో కోదాడకు చెందిన విద్యార్థి ఉస్తెల ధనుష్‌రెడ్డి విద్యా విభాగంలో సీటు సాధించాడు. ఉస్మానియా వర్సిటీలో బీఎడ్ పూర్తి చేసిన ధనుష్‌రెడ్డి విద్యారంగంపై ఉన్న ఆసక్తితో ఈ యూనివర్సిటీలో ఎంఏ ఎడ్యుకేషన్‌లో సీటు సాధించాడు. కేవలం 35 సీట్లు మాత్రమే ఉండే ఈ యూనివర్సిటీ విద్యావిభాగానికి దేశ వ్యాప్తంగా తీవ్రమైన పోటీ ఉంటుంది. విద్యా రంగంలో భవిష్యత్తులో వచ్చే మార్పులకు అనుగుణంగా బోధనలో తీసుకురావాల్సిన మార్పులపై నూతన పద్ధతులను నేర్చుకోవడానికి ఈ యూనివర్సిటీని వేదికగా ఉపయోగించుకుంటానని ఈ సందర్భంగా ధనుష్‌రెడ్డి తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌కు ఏఎంసీ చైర్‌పర్సన్ సన్మానం


మంత్రి ఉత్తమ్‌ను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రాధికాఅరుణ్‌కుమార్

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ రాధికాఅరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించడం పట్ల మంత్రి ఉత్తమ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువాతో మంత్రిని సన్మానించారు. ఆమె వెంట అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సామాజిక కార్యకర్త గోపయ్యకు గౌరవ డాక్టరేట్


మొలుగూరి గోపయ్యకు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న నిర్వాహకులు

మునగాల : నడిగూడెం మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త మొలుగూరి గోపయ్యకు గౌరవ డాక్టరేట్ లభించింది. సోమవారం హైదరాబాద్‌లోని సిటీ కల్చరల్ సెంటర్ కళాభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గోపయ్య మాట్లాడుతూ.. తాను వ్యవసాయ రంగంలో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ గౌరవ డాక్టరేట్ బిరుదు అందించడం ఆనందంగా ఉందన్నారు. రెండున్నర సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయంపై చేపడుతున్న రైతు చైతన్య యాత్రను సంస్థ గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ డాక్టర్ ఆలూరి విల్సన్, సలహాదారు ఇందిర, సంస్థ ప్రతినిధులు, పలువురు రచయితలు, సినీ, బుల్లితెర గాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునగాల : మండలంలోని రేపాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నర్సింహులగూడెం, కే2, తాడువాయి, వెంకట్రాంపురం, కలకోవ ఫీడర్ల పరిధిలో చెట్ల తొలగింపు చేపడుతున్నందున వ్యవసాయానికి, ఆయా గ్రామాలకు మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల ట్రాన్స్‌కో ఏఈ వికాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై ప్రజావాణిలో ఫిర్యాదు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం గుడిమల్కాపురం గ్రామంలో గల బందెల దొడ్డిలో ఇటీవల ఎనిమిది గేదెలు పడగా ఒకటే నంబర్ గల జరిమానా రసీదును ఇద్దరు గేదెల యజమానులకు ఇచ్చిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన పి.ముత్తయ్య సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జానకీనగర్ రోడ్డుకు మోక్షం

- డబుల్ లైన్‌గా మారనున్న జానకీనగర్ రహదారి
- నేడు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


డబుల్ లైన్‌గా మారనున్న జానకీనగర్ రోడ్డు

చిలుకూరు : మండలంలో మరో రోడ్డుకు మోక్షం లభించింది. ఇప్పటికే బేతవోలు డబుల్ రోడ్డు పనులు దాదాపు పూర్తికావొస్తుండగా సింగిల్ లైన్‌గా ఉన్న జానకీనగర్ రహదారి త్వరలో డబుల్ రోడ్డుగా మారనుంది. కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ ఎన్నెస్పీ కాలువ వద్ద నుంచి చిలుకూరు మండలం జానకీనగర్, దూదియాతండా, సీత్లాతండా, నారాయణపురం మీదుగా కోదాడ మండలం భీక్యాతండా వరకు రూ.10 కిలోమీటర్ల మేర గల సింగిల్ లైన్ రోడ్డు డబుల్ రోడ్డుగా మారనుంది. గతంలోనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చొరవతో రూ. 20. 40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మంగళవారం మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన చేయనున్నారు. డబుల్ రోడ్డుకు మోక్షం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7 మీటర్ల వెడల్పు బీటీగా..

జానకీనగర్ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం 10 ఫీట్ల వెడల్పుతో సింగిల్ రోడ్డు ఉంది. కానీ చుట్టూ ఆక్రమణకు గురైంది. రోడ్డుకు ఇరుపక్కల మార్జిన్ కూడా లేదు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే పక్కకు దిగే పరిస్థితి కూడా లేదు. అంతేకాకుండా ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. దీంతో రోడ్డును 7 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డుగా మార్చేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. బీటీతో పాటు రోడ్డు ఇరు పక్కల కలిపి 3 మీటర్లు మట్టి రోడ్డు ఉంటుంది. మొత్తం 33 ఫీట్ల రోడ్డుగా మారనుంది.

పనులు వెంటనే ప్రారంభిస్తాం

జానకీనగర్ రోడ్డు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేయనున్నాం. రోడ్డు నిర్మాణ పనులను కూడా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా.
– ఎస్. పద్మావతిరెడ్డి, ఎమ్మెల్యే

న్యాయవాదుల సహకారం మరువలేనిది

- సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్


జడ్జి దంపతులను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

హుజూర్‌నగర్ : తన మూడేళ్ల విధి నిర్వహణలో హుజూర్‌నగర్ న్యాయవాదులు అందించిన సహకారం మరువలేనిదని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ అన్నారు. ఇటీవల ఆయన బదిలీ అయిన సందర్భంగా సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. తను పదవీ బాధ్యతలు స్వీకరించినప్పుడు 1,067 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ కేసులను 300కు తీసుకువచ్చానన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కొన్ని కేసులు జడ్జి ముందుకు రానే రాలేదని వాటిని వాయిదాల సెక్షన్‌లోనే వేసేవారని, ఆ విధానానికి స్వస్తి చెప్పి తాను అన్ని కేసులను న్యాయమూర్తి ముందుకు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నానని పేర్కొన్నారు. కేసులో ఉన్న సాక్ష్యాధారాలను బట్టి తీర్పులు వెలువరించామని, కొన్ని కేసుల్లో శిక్షలు కూడా విధించామని అది తన ఉద్యోగ ధర్మంగా చేసింది తప్ప వ్యక్తిగతం కాదన్నారు. భూసేకరణలో తమ ఆస్తులను పోగొట్టుకొని పరిహారం కోసం కోర్టు చుట్టూ తిరుగుతున్న రైతుల బాధను గుర్తించి వారి కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రయత్నించానని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా న్యాయమూర్తుల కొరత అధికంగా ఉందని జూనియర్ న్యాయవాదులు కష్టపడి చదివి న్యాయమూర్తులుగా ఎంపికయ్యేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, న్యాయవాదులు నారపరాజు శ్రీనివాసరావు, కాల్వ శ్రీనివాసరావు, రవికుమార్, ఎంఎస్ రాఘవరావు, ఎస్.సత్యనారాయణ, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, డి.శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, సీహెచ్.కృష్ణయ్య, జె.నాగేశ్వరరావు, ఎం.అంజయ్య, ఏజీపీలు రేణుకాదేవి, సురేష్‌కుమార్, మహిళా న్యాయవాదులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం


చిలుకూరు : జెర్రిపోతులగూడెంలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్లు

చిలుకూరు : పౌష్టికాహారం తీసుకుంటే మహిళల్లో రక్త హీనత తలెత్తకుండా ఉంటుందని హుజూర్‌నగర్ సీడీపీఓ వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునిత, ఉపేంద్ర, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు విలాసకవి నిర్మల, అరుణ, లక్ష్మి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

నేరేడుచర్ల : చిరు ధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో కిశోర బాలికలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎలిజిబెత్, వెంకటరమణ, చంద్రకళ, ఆయా విజయలక్ష్మి తదితరులున్నారు.

శాంతిబాబు మృతి సీపీఎంకు తీరని లోటు


మునగాల : శాంతిబాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాగార్జునరెడ్డి, నాయకులు

మునగాల : మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి మండవ శాంతిబాబు (35) మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. శాంతిబాబుకు కిడ్నీలు ఫెయిల్ కావడంతో ఇటీవల అనారోగ్యానికి గురై ఖమ్మం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున కన్నుమూశాడు. సోమవారం కలకోవలో శాంతిబాబు మృతదేహానికి నాగార్జునరెడ్డి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. కాగా, మృతుడి భార్య కూడా ఆరునెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. శాంతిబాబు దంపతులిద్దరూ మృతిచెందడంతో ఒక్కగానొక్క కూతురు ఆరేళ్ల చిన్నారి కార్తీక ఒంటరయింది. తన తండ్రికి చిన్నారి కార్తీక తలకొరివి పెట్టింది. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుల జూలకంటి విజయలక్ష్మి, షేక్ సైదా, మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకటరెడ్డి, మండవ వెంకటాద్రి, అనంతుల గుర్వయ్య, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాగరాజుకు నాయకుల నివాళి

కోదాడరూరల్ : ప్రజా సంఘాల నాయకుడు జాల నాగరాజు మృతి సీపీఎంకు, కుటుంబ సభ్యులకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దోరకుంటలో అనారోగ్యంతో మృతి చెందిన నాగరాజు మృతదేహాన్ని ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పల్లె వెంకట్‌రెడ్డి, సైదులు, ముత్యాలు, బ్రహ్మయ్య, నారాయణ, రాధాకృష్ణ, శ్రీను, కిరణ్, ఉదయ్ ఉన్నారు.

వనపర్తి సత్యంకు నివాళి

చిలుకూరు : బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వనపర్తి సత్యం ఆదివారం మృతి చెందారు. సోమవారం బేతవోలులో నిర్వహించిన సత్యం అంత్యక్రియల్లో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పీసీసీ డెలిగేట్ సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయం చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, ప్యాక్స్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రత్యేక మండలం ప్రకటించాలని వినతి

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంను మండల కేంద్రంగా ఏర్పాటు చేసి ప్రత్యేక మండలం ప్రకటించాలని ప్రజా కళాకారుడు బాదె నరసయ్య కోరారు. ఈమేరకు సోమవారం హుజూర్‌నగర్‌లో ఆర్డీఓ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన గరిడేపల్లికి చాలా గ్రామాలు దూరంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. ప్రజల సౌకర్యార్థం 14 గ్రామపంచాయతీలు, రెండు హామ్లెట్ విలేజ్‌లతో కలిపి కీతవారిగూడెం మండల కేంద్రంగా చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట లింగన్న ఉన్నారు.

కార్మికులు హక్కులను కాపాడుకోవాలి

మఠంపల్లి : ప్రభుత్వాలు కార్పొరేట్ రంగాలకు, యాజమాన్యాలకు కొమ్ముకాస్తూ పని గంటలు పెంచి హక్కులను హరించి వేస్తున్నందున కార్మికులు ఐక్యతతో తమ హక్కులను కాపాడుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్ అన్నారు. సోమవారం మఠంపల్లి మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులంతా మేడే వేడుకలను ఘనంగా జరుపుకోవాలని అన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ మండల నాయకులు సయ్యద్‌రన్‌మియా, పాడిశెట్టి రాము, శంభయ్య, బ్రహ్మచారి పాల్గొన్నారు.

రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించొద్దు

- ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేటటౌన్ : పట్టణాల్లో రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించవద్దని జిల్లా ఎస్పీ కె.నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణాల్లోని ముఖ్యమైన కూడళ్లు, జంక్షన్‌ల వద్ద, వాణిజ్య ప్రాంతాల్లో వాహనదారులు అడ్డగోలుగా వాహనాలు నిలపడం, వీధి వ్యాపారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహించడం వల్ల రద్దీ పెరుగుతూ ట్రాఫిక్ పెరిగి సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు వీటివల్ల ఇబ్బందులు పడుతున్నారని, వాహనాలు ఇతరులకు ఇబ్బంది కలగకుండా పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. దుకాణాలు ముందు అడ్డగోలుగా వాహనాలు నిలిపితే దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం


రూ.2లక్షల విరాళం అందజేస్తున్న మైహోం సిమెంట్ పరిశ్రమ అధికారులు

మఠంపల్లి : మండలంలోని గుండ్లపల్లిలో గల ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సోమవారం మైహోం సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం రూ.2 లక్షలు విరాళం అందజేశారు. మైహోం సిమెంట్స్ పరిశ్రమ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. ఆలయంలో అన్నదానం, తదితర కార్యక్రమాలకు సీఎస్‌ఆర్ నిధుల నుంచి విరాళం ఇచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండా బ్రహ్మారెడ్డి, పరిశ్రమ జీఎం శ్రీరామ్, ఏజీఎం శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జేడీ వాన్స్ దిష్టిబొమ్మ దహనం


జేడీ వాన్స్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

గరిడేపల్లి : అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారతదేశ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వెలిదండ గ్రామంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య మాట్లాడుతూ స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో మన దేశ వ్యవసాయం, పారిశ్రామిక అంశాలపై అసమానత ఒప్పందాలు చేసుకోవటానికి జేడీ వాన్స్ వచ్చారని, ఆయన రాకను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మేకల కనకారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, సీహెచ్.పెద్ద సాంబయ్య, మాశెట్టి అంజయ్య, చింతమల్ల అంజయ్య, చామకూరి వెంకటి, అరుణోదయ జిల్లా నాయకులు గండు నాగేశ్వరరావు, కారింగుల బ్రహ్మయ్య, వల్లపుదాసు లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

మోతె : యువత మత్తుకు బానిస కావొద్దని మోతె ఎస్సై యాదవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాంపురంతండాలో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, బెట్టింగ్‌లు, మత్తు పదార్థాల నివారణపై, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడడం అందరి బాధ్యత అని అన్నారు. మహిళలను, చిన్న పిల్లలను ఇబ్బంది పెడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అత్యాశతో యువత బెట్టింగ్‌లు పెట్టి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ రామనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మునగాల : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం మునగాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యువత ముఖ్యంగా ఐపీఎల్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు.

భూసమస్యల పరిష్కారానికి 'భూ భారతి'

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

అనంతగిరి : భూభారతి చట్టం–2025తో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం అనంతగిరి మండలంలోని శాంతినగర్‌లో గల ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు ధరణి చట్టం కంటే మెరుగైన సేవలు పొందేలా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. భూములకు సంబంధించిన ప్రతి సమస్యను భూభారతి చట్టం ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి కమతానికి భూధార్ కార్డును కేటాయించి, దీనిలో హద్దులతో కూడిన మ్యాప్ పొందుపర్చనున్నట్లు తెలిపారు. గతంలో తప్పుగా నమోదైన పొలం విస్తీర్ణం, యజమాని పేరు, సర్వే నెంబర్ల సవరణకు ఈ చట్టంలో వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. పౌతి(వారసత్వం) చేసేటప్పుడు కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ నోటీసులు ఇచ్చి ఆ తరువాతే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. సాధబైనామా, భాగాల పంపిణీ అధికారం ఆర్డీఓకు, పౌతి అధికారం తహసీల్దార్‌కు కేటాయించినట్లు తెలిపారు. గతంలో జరిగిన మ్యుటేషన్లపై అప్పీలు చేసుకునేందుకు ధరణిలో అవకాశం లేదని, నేరుగా కోర్టును ఆశ్రయించాల్సి వచ్చేదని, కానీ భూ భారతిలో తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మ్యుటేషన్లపై అభ్యంతరాలు ఉంటే రెండు అంచెలుగా అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. అనంతరం ఆర్డీఓ సూర్యానారాయణ మాట్లాడుతూ.. భూభారతిలోని ఒక్కో అంశాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.హిమబిందు, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ వీరీరామ్‌చంద్రరావు, డీటీ శ్రీధర్, ఆర్ఐ వెంకటనగేష్, ఏపీఎం లక్ష్మి, ఏఓ అందె సతీష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, లక్ష్మిరెడ్డి, మాధవి, సుధీర్‌రెడ్డి, సాయినాథ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, బాణోతు బాబు నాయక్, గుర్రం వెంకటరెడ్డి, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, డేగ కొండయ్య, షేక్ నాగుల్‌మీరా, స్వరూపరెడ్డి, నెల్లూరి వినయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ కొణతం ఉమాశ్రీనివాసరెడ్డి, వేనేపల్లి వెంకటయ్య, సీపీఐ నాయకులు బద్దం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎండీ అఫ్జల్, ఎస్‌కె అక్బర్, రైతులు పాల్గొన్నారు.

'బార్' ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ


నామినేషన్ దాఖలు చేస్తున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ దాఖలు ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. వివిధ పదవులకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఎన్నికల అధికారులు ఎమ్మెస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్యకు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి జక్కుల వీరయ్య, ఉపాధ్యక్షుడి పదవికి కుక్కడపు సైదులు, ప్రధాన కార్యదర్శి పదవికి బి.నాగేశ్వరరావు (నగేష్ రాథోడ్), సహాయ కార్యదర్శి పదవికి మద్దుల నాగేశ్వరరావు, లైబ్రరీ సెక్రటరీ పదవికి కొణతం శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యురాలు పదవికి షేక్ మౌలాబీ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లకు మంగళవారం వరకు గడువు ఉండటంతో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి


తమిళనాడు సీఎం స్టాలిన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మునగాల : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చిత్రపటానికి సోమవారం మండలంలోని కలకోవలో సంఘం నేతలతో కలిసి రాజేష్ పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు దివ్యంగులకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తున్న దివ్యాంగులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల శాఖ అధ్యక్షుడు గోపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గోగుల శేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మున్న మధుయాదవ్, విద్యార్థి సంఘం నాయకులు కొల్లూరి సాయి వికాస్, సాయి విక్రమ్, వినయ్, నాగవాణి, కావ్య తదితురు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి, నాయకులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ డివిజన్ సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ప్రతి వార్డులో సమావేశాలు నిర్వహించి కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు కేవీఎస్ మూర్తి, జడ వెంకన్న, కృష్ణ సైదులు, మస్తాన్, మల్లయ్య, ప్రసాద్, సత్యవతి, రమణ తదితరులు పాల్గొన్నారు.


కళాకారుడికి సన్మానం

హుజూర్‌నగర్ : మిర్యాలగూడెంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి పాటల పోటీల్లో హుజూర్‌నగర్‌కు చెందిన ప్రజానాట్యమండలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపనబోయిన వెంకటేశ్వర్లు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారు. సోమవారం ఆయనను సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, కేవీఎస్ మూర్తి యల్లావుల రాములు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

మోతె : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించబోయే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ఏలూరి వెంటేశ్వరరావు అన్నారు. సోమవారం మోతె మండలంలోని సర్వారం గ్రామంలో రజతోత్సవం సభ వాల్ రైటింగ్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు, గ్రామ శాఖ అధ్యక్షుడు మల్సూర్, మేకల రామయ్య, మట్టిపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే చర్యలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్

కోదాడరూరల్ : ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ హెచ్చరించారు. సోమవారం కోదాడ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద గల మిని ట్రాలీ ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. ఆటోలు, మినీ ట్రాలీ, టాటా ఏస్ వాహనాల్లో పరిమితికి మించి సరుకు తరలించవద్దని, అతివేగంగా వాహనాలను నడపవద్దని అన్నారు. యూటర్న్‌లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాహనాల పత్రాలు, లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ సిబ్బంది ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో మునగాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోదాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు సూచించారు. సోమవారం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి నిర్వాహకులు, రైతులతో మాట్లాడారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని సీరియల్ ప్రకారం ఎప్పటికప్పుడు కాంటాలు వేయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కాలె సామియేలు, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు ఓరుగంటి రవి, గంధం సైదులు పాల్గొన్నారు.

షుగర్ నిర్ధారణ వైద్యశిబిరం


వైద్య శిబిరంలో డాక్టర్లు, తదితరులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి వద్ద గల ఎన్‌సీఎల్ పరిశ్రమ వైద్యశాలలో సోమవారం విజయవాడకు చెందిన నాగార్జున వైద్యశాల వైద్యులచే బ్లూక్రాస్ సంస్థ ఆధ్వర్యంలో షుగర్ వ్యాధి ఉచిత నిర్ధారణ, చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మందిని పరీక్షించి రూ.30వేల విలువ గల మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ సీనియర్ ప్రెసిడెంట్ చక్రధర్, డాక్టర్ హిమబిందు, హెచ్‌ఆర్ సతీష్, దస్తగిరిరెడ్డి, పరిశ్రమ వైద్యాధికారి డాక్టర్ శ్రీహరిరావు, బ్లూక్రాస్ సంస్థ ప్రతినిధి పి.రాము, తదితరులు పాల్గొన్నారు.